## క్లుప్తంగా

### చౌడేశ్వరిదేవి ఆలయాభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

**బనగానపల్లె రూరల్:** నందవరం చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి అనంతపురం పట్టణానికి చెందిన గండికోట శివ, శైలజ దంపతులు రూ.25,116 విరాళం ఇచ్చారు. సోమవారం అమ్మవారిని దర్శించుకుని ఆలయ సిబ్బందికి విరాళ నగదును అందజేశారు. అర్చకులు దాతలను పూలమాలతో సత్కరించి అమ్మవారి తీర్థప్రసాదం అందజేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ కుమార్ రెడ్డి ఉన్నారు.

### జెడ్పీ చైర్‌పర్సన్‌పై దాడి అమానుషం

**కొలిమిగుండ్ల:** కృష్ణా జిల్లాకు చెందిన బీసీ మహిళ, జెడ్పీచైర్‌పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ, జనసేన నాయకులు దాడికి పాల్పడడం అమానుషమని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండయ్యగౌడ్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కూటమి పాలనలో మహిళలపై దాడులు పెరిగిపోతున్నాయన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు జరగడం మంచిది కాదన్నారు. మహిళా ప్రజాప్రతినిధికే రక్షణ లేకపోతే సామాన్య మహిళలకు భద్రత ఎక్కడ ఉంటుందన్నారు.

### బాధ్యతల స్వీకరణ



ఎల్లాగౌడ్

**డోన్:** డోన్ వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా చిన్నపూజెర్ల ఎల్లాగౌడ్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. స్థానిక కోట్లవారిపల్లెలోని పరపతి సంఘం కార్యాలయంలో సీఈఓ సుబ్బయ్య, ఎల్లాగౌడ్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. రైతాంగం సంక్షేమం కోసం శక్తివంచన లేకుండా పనిచేస్తానని ఎల్లాగౌడ్ తెలిపారు.

### మెప్మా రిసోర్స్ పర్సన్లకు ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే కోట్ల

**బేతంచెర్ల:** పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న మెప్మా పొదుపు సంఘాల రిసోర్స్ పర్సన్లకు ట్యాబ్‌లను డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పొదుపు సంఘాల సేవలను వేగవంతంగా, సాంకేతికంగా మరింత సమర్థవంతంగా అందించేందుకు ప్రభుత్వం డిజిటల్ విధానాన్ని ముందుకు తెచ్చిందన్నారు. మహిళా సంఘాల సమాచారం ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఈ ట్యాబ్‌లు ఉపయోగపడతాయని వివరించారు. కార్యక్రమానికి ముందు ఎమ్మెల్యే గోరుమానుకొండ, గోరుమానుకొండ తండా, బేతంచెర్ల 5, 6వ వార్డుల్లో పర్యటించారు. మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

### మృతికి నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

**బనగానపల్లె:** మండలంలోని మిట్టపల్లి గ్రామానికి చెందిన కాటసాని పుల్లారెడ్డి(68) మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సోమవారం గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు కాటసాని రామకృష్ణారెడ్డి రామసుబ్బిరెడ్డి తదితరులు ఉన్నారు.

### నివాళి



బోరెడ్డి శ్రీరామిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ

**ప్యాపిలి:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో దివంగత ప్యాపిలి జెడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామిరెడ్డి చిత్రపటానికి ఎంపీపీ గోకుల్ లక్ష్మి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు దిలీప్ చక్రవర్తి, ఎంపీటీసీలు, అధికారులు, సర్పంచ్‌లు సోమవారం నివాళి అర్పించారు. మండల సర్వసభ్య సమావేశంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ.. బోరెడ్డి శ్రీరామిరెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమన్నారు. ఆయన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు జలదుర్గం రసూల్ తదితరులు పాల్గొన్నారు.

# అదే వంచన

**అధికారం కోసం** ఆకర్షణీయమైన అబద్ధాలే ఆయుధాలుగా మలుచుకున్న తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడి అసలైన స్వరూపాన్ని ప్రజలు నెమ్మదిగా గ్రహిస్తున్నారు. 'సూపర్‌సిక్స్' పథకాల పేరిట కలల లోకానికి తీసుకెళ్లినా, అవి అమలవుతున్న తీరుతో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఏడాది గడిచినా హామీలన్నీ అట్టర్ ఫ్లాప్‌గా మిగిలిపోయాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి



కూటమి సర్కార్ ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలు

- మళ్లీ బాబు మార్క్ రాజకీయం
- ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్ హామీలతో ఓట్లు
- అధికారంలోకి వచ్చి ఏడాదైనా అమలు కాని హామీలు
- ప్రకటనలతో కాలయాపన
- అన్ని వర్గాలకు పంగనామాలు
- కూటమి పాలనపై ప్రజల అసంతృప్తి

**డోన్:** ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్ హామీలతో ఊదరగొట్టి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది గడిచినా ఏ ఒక్క హామీని సక్రమంగా అమలు చేయలేదు. ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ గట్టిగా నిలదీయడంతో ప్రజల నుంచి వ్యతిరేకత వస్తున్న భయంతో ఇటీవల తల్లికి వందనం అమలు చేయాల్సి వచ్చింది. మిగిలిన పథకాలు ఎప్పుడు అమలు చేస్తారో తెలియని పరిస్థితి. కూటమి నాయకులు ప్రకటనలు చేస్తూ కాలయాపన చేస్తున్నారు.

**వంచనలో బాబు టాప్**

2014 ఎన్నికల సమయంలో పసుపు కుంకుమ కింద పొదుపు మహిళలకు రుణాల మాఫీ, వ్యవసాయ రుణాల మాఫీ అంటూ ఎలా మభ్యపెట్టారో తిరిగి ఐదేళ్ల అనంతరం 2024లో అధికారం కోసం సూపర్‌సిక్స్ అంటూ నయా మోసానికి తెరలేపారు. ఏడాదికి 20 లక్షల మందికి ఉపాధి లేదా నెలకు రూ.3వేల నిరుద్యోగ భృతి, ప్రతి రైతుకు ఏటా రూ.20వేల ఆర్థిక సహాయం, ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఆర్థిక సహాయం, ప్రతి ఇంటికీ ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15వేలు అందిస్తామని ప్రజలను ఆశల పల్లకీ ఎక్కించారు. అయితే ఇందులో కేవలం తల్లికి వందనం పథకం మాత్రమే అమలు చేశారు. ఇందులోనూ ప్రతి విద్యార్థికి రూ.15వేల చొప్పున కాకుండా రూ.13వేల చొప్పున వేసి రూ.2వేలు కోత విధించారు. రాష్ట్రంలో 20 లక్షల మంది తల్లుల బ్యాంకులకు తల్లికి వందనం ద్వారా డబ్బులు జమచేయకుండా ఎగ్గొట్టారు.

**హామీలన్నీ అట్టర్‌ఫ్లాప్**

50 ఏళ్లు నిండిన బీసీ, ఎస్సీ, ఎస్టీలకు పెన్షన్ మంజూరు, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు రూ.1500 చొప్పున ఆర్థిక సహాయం, కార్పొరేషన్ల ద్వారా వివిధ కులాల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు, గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాలలో 2 సెంట్ల ఇళ్ల స్థలాల మంజూరు లాంటి అనేక పథకాలను అమలుచేయకుండా అటకెక్కించారు. అధికారం చేపట్టి ఏడాది గడిచినాకేవలం పెన్షన్ మొత్తం పెంపు, తల్లికి వందనం తప్ప మిగిలిన సంక్షేమ పథకాలన్నింటికీ మంగళం పాడారు.



డోన్‌లో కూటమి సర్కార్ నిర్లక్ష్యంతో నిరుపయోగంగా జగనన్న కాలనీ



డోన్ పట్టణంలో వెలసిన బెల్టుషాప్

### నిరుద్యోగులపై ఆశలపై నీళ్లు



2014 ఎన్నికల సమయంలో నిరుద్యోగ భృతి చెల్లిస్తానని హామీతో అధికారం చేపట్టిన చంద్రబాబునాయుడు విద్యావంతులైన నిరుద్యోగులను నిట్టనిలువునా ముంచేశారు. ఈ పథకం అమలు సాధ్యం కాదని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినా నిరుద్యోగులు మరోసారి చంద్రబాబు మాట విని 2024లో తిరిగి అధికారం కట్టబెట్టారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను కూడా కూటమి ప్రభుత్వం మూతపడే పరిస్థితికి తీసుకొచ్చి నిరుద్యోగులను నడిసముద్రంలో వదిలేశారు.

–దినేష్‌గౌడ్, వైఎస్సార్‌సీపీ సోషల్‌మీడియా కన్వీనర్, డోన్

### పేదల ఇళ్లు, ఒళ్లు గుల్ల



నాణ్యమైన మద్యం సరసమైన ధరలకు పంపిణీ చేస్తామని పేద, మధ్యతరగతి ప్రజల బలహీనతలే పెట్టుబడిగా భావించి కూటమి ప్రభుత్వం ఊరూరా బెల్టుషాపులను ఏర్పాటు చేసింది. దీంతో అడుగడుగునా తాగుబోతుల బెడద అధికమై జనజీవన సంచారానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఆదాయ సముపార్జనే ధ్యేయంగా కూటమి సర్కార్ మద్యం విక్రయాలను విచ్చలవిడిగా చేసి ప్రజల ఇళ్లు, ఒళ్లను గుల్ల చేస్తోంది. పచ్చని సంసారాలను నాశనం చేస్తోంది.

–సుమలత సురేష్, కౌన్సిలర్, డోన్

### మభ్యపెట్టి మాయ చేసింది



నాకు ఇద్దరు పిల్లలు. మాది ప్యాపిలి మండలం పోదొడ్డి గ్రామం. ప్యాపిలిలో ఒకరు 9వ తరగతి, మరొకరు జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఇద్దరిలో ఏఒక్కరి పేరుపై కూడా నా బ్యాంకు ఖాతాకు తల్లికి వందనం డబ్బులు జమకాలేదు. ఎంత మంది పిల్లలు చదువుతుంటే అంతమందికి తల్లికి వందనం కింద బ్యాంకులో డబ్బు జమచేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం మా లాంటి వారిని మాయచేసి మభ్యపెట్టింది.

–పెద్దక్క, పోదొడ్డి గ్రామం, ప్యాపిలి

### రైతాంగానికి పంగనామం



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విత్తనాల ఎంపిక, పంపిణీ దగ్గర నుంచి పంట కొనుగోలు, గిట్టుబాటు ధర చెల్లింపు వరకు రైతాంగానికి అండగా ఉండేది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు పంపిణీ చేయలేదు. అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి రూ.20వేలు ఇస్తామని ఈ ఏడాది ఎగ్గొట్టింది. రైతులకు గిట్టుబాటు ధర కల్పించలేదు. రైతాంగాన్ని ఆశల పల్లకిలో ఊరేగించి నడిసముద్రంలో ముంచింది.

–శ్రీరాములు, రైతు, ధర్మవరం, డోన్

### తుస్సుమన్న ఉచిత బస్సు



ఆడపడుచులు ఎక్కడైనా బస్సు ఎక్కి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చని ఎన్నికల సమయంలో చంద్రబాబు ఊరించారు. ఏడాది గడిచినా ఈ హామీని నిలబెట్టుకోలేకపోయారు. జిల్లా వరకే ఉచిత ప్రయాణం అంటూ మెలికపెడుతున్నారు. మహిళల ఆశలపై నీళ్లు చల్లే ప్రయత్నం చేస్తున్నారు. గతంలో డ్వాక్రా మహిళలకు పసుపు కుంకుమ కింద ఆర్థిక సహాయం పేరుతో మోసగించిన చంద్రబాబు మరోసారి ఉచిత బస్సు హామీతో మోసగిస్తున్నారు.

–వెంకటేశ్వరమ్మ, మున్సిపల్ కౌన్సిలర్, డోన్

## ఉమామహేశ్వరునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

**బనగానపల్లె రూరల్:** మండలంలోని యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ పాండురంగారెడ్డి, అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం ఉమామహేశ్వరునికి అభిషేకం, అర్చన తదితర పూజలు చేశారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ముస్తాబు చేసి పల్లకీలో కొలువుంచారు. ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## ఆటో డ్రైవర్లకు పథకాలు వర్తింపచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్

**కోవెలకుంట్ల:** నాలుగు చక్రాల ఆటో డ్రైవర్ల కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు సుధాకర్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక గ్రామ పంచాయతీ ఆటో పార్కింగ్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫోర్ వీలర్స్ వాహనాలు ఉంటే సంక్షేమ పథకాలకు అనర్హులని ప్రభుత్వం నిబంధన విధించిందన్నారు. అయితే ఫోర్ వీలర్ ఆటోలు ఉన్న యజమానులను చిన్న స్థాయి కార్మికులుగా గుర్తించి వారికి అన్ని సంక్షేమ పథకాలతోపాటు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఆటో యూనియన్ నాయకులు రఘు, రాజు, మద్దిలేటి, భూషణం, నడిపెన్న, సుబ్బారెడ్డి, కుమయార్, శ్రీను, మధు పాల్గొన్నారు.

## పొదుపు సంఘాల ఆర్థికాభివృద్ధికి కృషి



వెలుగు సిబ్బందితో మాట్లాడుతున్న డీపీఎం

**బనగానపల్లె రూరల్:** డీఆర్‌డీఏ వెలుగు సిబ్బంది పొదుపు సంఘాల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని ఆ శాఖ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ హనుమాన్‌నాయక్ అన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో వివిధ అంశాలపై క్లస్టర్ స్థాయి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. డీపీఎం మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో పొదుపు సంఘాల సభ్యులతో గ్రామ సభ ఏర్పాటు చేసి వారి అవసరాలను తెలుసుకోవాలని సూచించారు. గ్రామంలో మౌలిక వసతుల అవసరాన్ని గుర్తించి గ్రామ సభలో తీర్మాణం చేసి అధికారులకు పంపాలన్నారు. జిల్లా స్త్రీనిధి ఏజీఎం నాగప్రసాద్ మాట్లాడుతూ.. డ్వాక్రా సంఘాల మహిళలకు స్త్రీనిధి పథకంపై అవగాహన కల్పించి, అవసరం ఉన్న మహిళాలు ఈ పథకాన్ని సక్రమంగా సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు.

### ఫర్టిలైజర్స్ దుకాణాల తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

**బనగానపల్లె రూరల్:** పట్టణంలోని ఎరువులు, పురుగుల మందుల దుకాణాలపై రాష్ట్ర స్థాయి తనిఖీ బృందం సోమవారం తనిఖీ చేపట్టింది. విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం, కమలాపురం సహాయ సంచాలకుడు నరసింహారెడ్డితో కూడి అధికారులు తనిఖీలు చేశారు. సీతారామ ఫర్టిలైజర్స్‌లో సుమారు రూ.3,75,000 స్టాక్, అలాగే సత్యం కెమికల్స్ దుకాణంలో రూ.1,63,000 స్టాక్‌కు సంబంధించి సరైన బిల్లులు చూపించకపోవడంతో విక్రయాలను నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. విక్రయించే ప్రతి దానికి తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలన్నారు. అధిక ధరలకు ఎరువులు, యూరియా, పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

### డివైడర్‌ను ఢీకొన్న టిప్పర్



ప్రమాదానికి గురైన టిప్పర్

**బనగానపల్లె రూరల్:** పట్టణంలోని బేతంచర్ల రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో టిప్పర్ లారీ డివైడర్‌ను ఢీకొంది. వివరాలు.. సోమవారం తెల్లవారుజామున 4.30 గంటలకు బత్తులూరుపాడు నుంచి బనగానపల్లె వైపు వస్తున్న టిప్పర్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద అదుపుతప్పి ఫోర్‌లైన్స్ రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన డివైడర్‌ను ఢీకొట్టింది. డివైడర్ ధ్వంసమైంది. ఆ సమయంలో జనసంచారం లేకపోవడంతో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. డ్రైవర్ నిద్రమత్తులో ఉండడం వల్లే ప్రమాదం జరిగి ఉంటుందని అనుమానిస్తున్నారు. స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

### మహిళపై దాడి

**కోవెలకుంట్ల:** పట్టణంలోని బసిరెడ్డిబావివీధి సమీపంలో సోమవారం సాయంత్రం ఓ మహిళపై దాడి జరిగినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. కాలనీకి చెందిన హసీనాకు మల్లేశ్వరి, కిషోర్, మల్లిక మధ్య ఇంటి వద్ద నీళ్లు పట్టుకునే విషయంలో గొడవ చోటు చేసుకుంది. ఈ క్రమంలో ముగ్గురు వ్యక్తులు హసీనాపై దాడి చేయడంతో గాయపడింది. బాధితురాలు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

### మోదీతో సుపరిపాలన సాధ్యం

**డోన్ టౌన్:** ప్రధాన మంత్రి నరేంద్రమోదీతో సుపరిపాలన సాధ్యం అవుతుందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమ సుందర్‌రెడ్డి అన్నారు. మోదీ 11 ఏళ్ల పాలనపై ముద్రించిన కరపత్రాలను డోన్ మండలంలోని ఉడుములపాడు, జగదుర్తి గ్రామాల్లో సోమవారం పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను స్థానికులకు వివరించారు. బీజేపీ నాయకులు రామచంద్రనాయుడు, పోలా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### అదనపు లోడుతో రూ.17 లక్షల రాబడి

**డోన్ టౌన్:** విద్యుత్ వినియోగదారులు అదనపు లోడు క్రమబద్ధీకరణ చేసుకోవడం ద్వారా రూ. 17,06,000 ఆదాయం వచ్చినట్లు ఆ శాఖ ఈఈ కమలాకర్‌రావు తెలిపారు. సోమవారం డోన్‌లో ఆయన మాట్లాడుతూ.. అదనపు లోడు విని యోగదారులకు క్రమబద్ధీకరణ చేసుకోవడానికి విద్యుత్‌శాఖ అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఫలితంగా డోన్ డివిజన్‌లోని డోన్, బేతంచెర్ల, బనగానపల్లెకు సంబంధించి 1384 మంది వినియోగదారులు సర్వీసులను క్రమబద్ధీకరించుకున్నారని వెల్లడించారు. దీంతో రూ.17 లక్షల ఆదాయం సమకూరినట్లు పేర్కొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**డోన్ టౌన్:** యు.కొత్తపల్లె సబ్‌స్టేషన్ పరిధిలోని యు.కొత్తపల్లె, ఉంగరాణిగుండ్ల గ్రామాల్లో 11 కేవీ పనులు, మల్యాల ఫీడర్ పరిధిలో రూరల్ డెవలప్‌మెంట్ పనులు జరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాలతో పాటు మల్యాల, సీసంగుంతల గ్రామాలకు మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. రైతులకు ఇచ్చే త్రీఫేస్ కరెంటు తెల్లవారుజామున 3 నుంచి ఉదయం 10 గంటల వరకు.. మళ్లీ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

### ఎంఎస్‌ఎంఈలో శిక్షణ తరగతులను ప్రారంభించాలి

**బేతంచెర్ల:** మండల పరిధిలోని గోరుమానుకొండ గ్రామ సమీపంలోని ఎంఎస్‌ఎంఈ భవనాల్లో శిక్షణ తరగతులను ప్రారంభించాలని ఏపీఎస్‌ఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు నాగ సురేంద్ర కోరారు. ఈ మేరకు సోమవారం గ్రామాన్ని సందర్శించిన డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో గోరుమానుకొండ సమీపంలో ప్రభుత్వ ఐటీఐతోపాటు ఎంఎస్‌ఎంఈ యూనిట్ నిర్మాణాలు చేపట్టారని, కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ భవనాలను వినియోగించకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విశాఖపట్నం తరువాత రెండవ ఎంఎస్‌ఎంఈ యూనిట్ బేతంచెర్ల మండలంలోనే ఉందన్నారు. అదే విధంగా పాలిటెక్నిక్ కళాశాల భవనం మంజూరై సంవత్సరం పూర్తయినా నిర్మాణ పనులు ప్రారంభం కాలేదన్నారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

### అనాథ శవానికి అంత్యక్రియలు

**డోన్:** పట్టణంలోని గుత్తిరోడ్డులో ఉన్న శేగు సినిమా థియేటర్ వద్ద గుర్తుతెలియని వృద్ధుడి (సుమారు 80 ఏళ్లు) మృతదేహాన్ని ఆదివారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడు ముస్లింగా గుర్తించారు. సీఐ ఇంతియాజ్‌బాషా సూచన మేరకు సోమవారం ఆత్మబంధువు సంస్థ సభ్యులు ఆ మతపద్ధతుల ప్రకారం కబరస్తాన్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. ఇందుకు అవసరమైన ఖర్చును 21వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ సాధిక్, రోటరీ క్లబ్ సభ్యుడు రాజయ్యగౌడ్ సమకూర్చారు. సేవా సంస్థ సభ్యులు పానిపూరి మురళి, సుధాకర్, బాబా, పెద్ద మధు, ఇక్బాల్, చిన్న మధు, మదీనా రఫీ, అబ్దుల్, రఫీ పాల్గొన్నారు.

## గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి

- గ్రామాల్లో తాగునీటి సమస్యలు రానీయొద్దు
- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ గోకుల్ లక్ష్మి



సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ, ఎంపీడీఓ

**ప్యాపిలి:** గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని ఎంపీపీ గోకుల్ లక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు గత మూడు నెలల్లో తమ శాఖలో జరిగిన ప్రగతిని నివేదికల రూపంలో సమర్పించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితుల కారణంగా పలు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొన్నట్లు సమాచారం అందుతోందని తెలిపారు. సంబంధిత అధికారులు గ్రామాల్లో పర్యటించి నీటి సమస్యకు గల కారణాలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలన్నారు. వర్షాకాలంలో సంక్రమించే సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. 15 రోజులకు ఒకసారి తప్పనిసరిగా నీళ్ల ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలని సూచించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మండల స్థాయి అధికారులతో పాటు గ్రామ స్థాయి అధికారులు కూడా ప్రజలకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో కోఆప్షన్ మెంబర్ జలదుర్గం రసూల్, ఎంపీటీసీ సభ్యులు శివకుమారి, జయరామయ్య, ఉద్యానశాఖ అధికారిణి కళ్యాణి, వ్యవసాయాధికారి రాజేశ్, ఎంఈఓ వెంకటేశ్ నాయక్, ఏపీఓ శ్రీవిద్య, వైద్యాధికారి రాహుల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## మోకాళ్లపై నిలబడి కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న ఇంజనీరింగ్ కార్మికులు

**బేతంచెర్ల:** మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట మోకాళ్లపై నిలబడి కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 15 రోజుల క్రితం రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి ఆర్. నారాయణకు తమ సమస్యలపై వినతిపత్రం అందజేశామని గుర్తు చేశారు. జీవో నెం.36 ప్రకారం ప్రతి కార్మికుడికి రూ.21 వేలు జీతం చెల్లించాలని, సీనియర్ కార్మికులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్లు కల్పించాలని కోరారు. ప్రభుత్వ స్పందన లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## రేపటి నుంచి సమ్మెలోకి పారిశుద్ధ్య కార్మికులు



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

**డోన్ టౌన్:** మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు బుధవారం నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు సీఐటీయూ పట్టణ కార్యదర్శి శివరామ్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకుడు భాస్కరాచారి, డోన్ అధ్యక్ష కార్యదర్శులు పెద్ద ఎల్లప్ప, కుల్లాయప్ప తెలిపారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్‌ను కలిసి సమ్మె నోటీస్ అందజేశారు. కార్మికులకు జీఓ 36 ప్రకారం వేతనాలు ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయాలని, మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగం ఇవ్వాలని కోరారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యూటీ తదితర డిమాండ్ల సాధన కోసం ఉద్యమబాట పట్టినట్లు తెలిపారు. కాగా ఇప్పటికే ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులు సమ్మెలో ఉండగా ఇప్పుడు పారిశుద్ధ్య కార్మికులు కూడా సమ్మెలోకి వెళుతుండడంతో సేవలకు తీవ్ర అంతరాయం కలిగే అవకాశం ఉంది.

### పాఠశాల ప్రహరీ నిర్మించాలని నిరసన



నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

**సంజామల:** స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. సోమవారం పాఠశాల ఆవరణలో నిరసన తెలిపారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులకు సమస్యను విన్నవించారు. కాగా పాఠశాలలో సుమారు 80 మంది విద్యార్థులు చదువుతున్నారు. సంజామల–గుళ్లదుర్తి ప్రధాన రోడ్డు పక్కనే పాఠశాల ఉండడంతో వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటున్నాయి. ఏదైనా ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి ప్రహరీ గోడ నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

### సోషల్ నర్సరీ పరిశీలన



రెడ్డిపల్లెలోని నర్సరీని పరిశీలిస్తున్న ఏపీడీ

**సంజామల:** మండల పరిధిలోని రెడ్డిపల్లె గ్రామంలో సోషల్ నర్సరీని ఉపాధిహామీ ఏపీడీ సాంబశివరావు సోమవారం పరిశీలించారు. అనంతరం పేరుసోముల, రెడ్డిపల్లె గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధిహామీ పథకంలో ఆయిల్ పామ్ చేసుకోవడానికి రైతులకు మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు చేసుకునే రైతులకు ప్రభుత్వం రాయితీ కల్పిస్తుందన్నారు. ఆయన వెంట ఏఈఓ జయంతి, టీఏలు అక్బర్, లక్ష్మయ్య, ఓబులేసు ఉన్నారు.